

గండేట 'మాయ' పుస్తక పరిచయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు రచించిన మాయ కథాసంపుటి పరిచయ సభ ప్రముఖకవి గనారా అధ్యక్షత ఆదివారం నిర్వహించారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు చెందిన గంటేడ గౌరునాయుడి కవిత్వం, కథల్లో పల్లెజీవనం ప్రతిఫలిస్తూ, మట్టిపరిమళం గుబాళిస్తుందన్నారు. గనారా మాట్లాడుతూ గౌరునాయుడి రచనలు సామాజిక స్పృహతో పాఠకుల్ని చైతన్యవంతం చేస్తాయన్నారు. అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ గౌరునాయుడి సాహిత్యం యువకవులకు దిశా నిర్ధేశం చేసే కరదీపిక వంటిదన్నారు. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో పద్మజవాణి, సత్యనారాయణమూర్తి, గరికపాటి, డాక్టర్ శైలజ, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, అవధానుల మణిబాబు ఉన్నారు.

మరమ్మతుల్లో అంగన్‌వాడీ యంత్రాలు

సిబ్బందికి తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎత్తు, బరువు కొలిచే పరికరాలు మరమ్మతులకు గురైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 5,546 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3,23,575 మంది పిల్లలున్నారు. వీటిలో సుమారు 5 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 4,818 మంది ఆయాలు పని చేస్తున్నారు.

పిల్లలు, గర్భిణులు, బాలింతలు వారి ఆరోగ్య పరిస్థితిని, పోషకాహార లోపాలను ఎప్పటికప్పుడు తెలుసు కోవాలంటే వారి బరువు, ఎత్తు తెలుసుకోవాలి. పిల్లల్లో లోపాలను గుర్తించాలన్నా ఇవి కీలకం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇదేళ్ల క్రితం రెండేళ్ల లోపు పిల్లల ఎత్తు కొలిచేందుకు ఇన్‌ఫ్యాంటో మీటర్, రెండేళ్ళు పైబడి వయస్సు గల చిన్నారుల ఎత్తును కొలిచేందుకు స్టేడియో మీటర్, బరువును తెలుసుకునేందుకు సాల్టర్ స్కేల్, పెద్దల బరువును తూచేందుకు అడల్ట్ వెయింగ్ మిషన్‌లను ప్రతి అంగన్వాడీ కేంద్రాలకూ అందజేసింది. పలు కేంద్రాల్లో ఇవి పాడై మూలకు చేరాయి. చాలా చోట్ల ఇచ్చిన మొదట్లోనే విరిగిపోయాయని పలువురు వర్కర్లు తెలిపారు. దీంతో ఎత్తు, బరువును కొలించేందుకు వారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలను నివేదికలో పొందుపరచడానికి తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా బోధనతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సరైన పోషకాహారం అందజేస్తూ ప్రతి నెలా వారి ఆరోగ్య పరిస్థితులను నివేదికల్లో నమోదు చేయాలి. ఎత్తుకు తగిన బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు ఎలా ఉన్నారనే వివరాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ యాప్‌లో ఆన్‌లైన్ చేయాలి. ఇవన్నీ చేయడానికి అంగన్‌వాడీలు తాత్కాలిక పద్ధతులను అనుసరిస్తున్నారు. గోడలకు స్కేల్ వేసుకుని ఎత్తులు కొలిచే పరిస్థితి నెలకొందని, విరిగిన పరికరాలనే ఉపయోగించాల్సి వస్తుందని పలువురు తెలిపారు.



మూలకు చేరిన ఎత్తు కొలిచే పరికరం



పని చేయని బరువు కొలిచే యంత్రం

పరికరాలు పంపిణీ చేయాలి



బరువు, ఎత్తు కొలిచే పరికరాలు మూలకు చేరడంతో యాప్‌లలో నమోదు చేయడానికి నానా పాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పరికరాలు త్వరితగతిన అందజేయాలి. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు కూడా ప్రభుత్వానికి నివేదించాలి.

- ఇ.చంద్రావతి, జిల్లా కార్యదర్శి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్.

నాడు జయలక్ష్మి... నేడు కార్తికేయ

- రేపు వివరాలు వెల్లడి
- రూ.10 కోట్లపైనే గుర్తింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఖాతాదారుల సొమ్ములకు అధిక వడ్డీలు ఇస్తామంటూ నమ్మబలికి అధిక సంఖ్యలో సొమ్ములను రికవరీ చేసి మొహం చాటేసిన ది జయలక్ష్మి స్థానంలో కాకినాడలో ది కార్తికేయ కో-ఆపరేటివ్ సొసైటీ వచ్చి చేరింది. మోసపోయే వాళ్లు ఉంటే మోసం చేయడానికి అనేకదారులు ఉన్నట్టుగా కాకినాడలో కార్తికేయ బ్యాంకు వచ్చి చేరింది. సంవత్సర కాలంలో కాకినాడ జిల్లాలోని రెండు బ్యాంకుల లబ్ధిదారులను మోసం చేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. జయలక్ష్మి బ్యాంకులో అభియోగాలు రాకముందు వరకు ఖాతాదారుల పట్ల సవ్యంగా నడుచుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా 29 బ్రాంచీలను ఏర్పాటు చేసి అధిక మొత్తంలో ఖాతాదారులను సంపాదించింది. కానీ కొంతమంది పెత్తందారులు బ్యాంక్ సొమ్ములను నకిలీ డాక్యుమెంట్లను పెట్టి కోట్లాది రూపాయలు తీసుకున్నారు. వాటిలో యాజమాన్యం కూడా సొమ్ములను వివిధ సొంత ఖర్చులకు వినియోగించుకోవడంతో దివాలా తీసింది. ది కార్తికేయ బ్యాంకులో సుమారు 300 మంది నుంచి రూ.10 కోట్లకు పైనే ఖాతాదారుల నుంచి బ్యాంకులో జమ చేసినట్లు సమాచారం. వారం రోజులుగా ఖాతాదారుల నుంచి సహకార సూపరింటెండెంట్ ప్రసాద్ ఖాతాదారుల నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఖాతాదారులు ఇప్పటివరకు ఎంత జమ చేశారు.. వారి కాలం అయిపోయి ఎన్ని రోజులవుతుందిం.. ఇలా పలు అంశాలపై లబ్ధిదారుల నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా సహకార శాఖ కార్యాలయం వెల్లడించనుంది.



పుస్తక పఠనంపై ఆసక్తి పెంపునకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద పార్కులో ఆదివారం పాఠశాల విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వారిచే అక్బర్ బీర్బల్ కథలు జాతక కథలు, వేమన శతకం, బొమ్మల రామాయణం, అరేబియన్ నైట్స్ తదితర కథలను లైబ్రేరియన్ శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులకు కథలో చదవడంలో పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేసినట్టు తెలిపారు.

రూ.28 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆర్థిక సామాజిక అభ్యున్నతికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాకినాడ రూరల్ మండలం, కొవ్వూరు గ్రామంలో రూ.28 లక్షల నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు తదితర పలు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

నేడు కాకినాడలోనే స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 10వ తేదీ సోమవారం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9-30 గంటల నుంచి జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ అంశాన్ని గమనించాలని ఆమె కోరారు.

చర్చికి రూ.పది వేల విరాళం అందజేత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని తూర్పు లక్ష్మీపురంలోని లూథరన్ చర్చి అభివృద్ధికి ఎంపిటిసి సభ్యుడు విజనగిరి వరప్రసాద్ రూ.పది వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో కుల మతాలకు వ్యతిరేకంగా అందరం కలిసి ఉండడం ప్రత్యేకత అన్నారు. హిందూ పండుగల్లో క్రైస్తవులు, క్రైస్తవ పర్వదినాలలో హిందువులు కలిసి పండుగలు చేసుకోవడం ఒకరి మరొకరు పంచుకోవడం వల్లనే లక్ష్మీపురం గ్రామం శాంతికి మారుపేరుగా కొనసాగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ శాంతి బాబు సభ్యులు ఉన్నారు.

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ


కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మతోన్మాద, రాజ్యాంగ, లౌకిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14 నుంచి 30 వరకు కాకినాడ జిల్లావ్యాప్తంగా గ్రామ గ్రామానా ప్రచార ఆందోళన నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక కాస్మో హాల్లో సిపిఐ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశంలో జి.లోవరత్నం అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రభాకర్ మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ సంఘ పరివార్ సూచనలతో మోడీ పరిపాలన చేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడుస్తున్నారన్నారు. మతోన్మాదం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసి అఖండ హిందూ భారత్ పిలుపుని అమలు చేయాలనుకుంటున్నారని, భారతదేశం భిన్న జాతులు భిన్న సంస్కృతులు భిన్న భాషలగల దేశమని అటువంటి భారతదేశాన్ని నరేంద్ర మోడీ హిందూ మతోన్మాదంగా మార్చాలని కుట్ర చేస్తున్నారన్నారన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను అమ్మేసి బడా కార్పొరేట్ వ్యక్తులకు దాసోహం చేస్తున్నారనీ దేశ సహజ సంపదను అదానీ, అంబానీ చేతుల్లో పెడుతున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ దేశంలో దళిత మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. విశాఖ ఉక్కు పోరాటం 700 రోజులు పైపడినా ఇప్పటికీ రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు నోరు మెదపడం లేదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, శివకోటి రాజు, పిస్.నారాయణ. టి.అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'మా నమ్మకం నువ్వే జగన్'

జిల్లావ్యాప్తంగా ఆదివారం పలు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు పి.మల్లవరం పంచాయతీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించిన సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. జగనన్న పేరుతో ఉన్న స్టిక్కర్లను అతికించారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ, సచివాలయ మండల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, ఉప సర్పంచ్ పంపన రామకష్ణ, పిల్లి వీరనాగు, మేడిశెట్టి శ్రీను, కావూరి వెంకటేశ్వర్లు, సబ్బతి రామకృష్ణ, పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని రాజవరం గ్రామంలో సచివాలయ కన్వీనర్ పంచాడ అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పలు నివాసాలకు వెళ్లి ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు ఈ కార్యక్రమంలో గృహ సారథులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



రౌతులపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

శహపురంలో గడప గడపకూ..

ప్రజాశక్తి-పెదపూడి

ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కొనియాడారు. శహపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మూడో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో అక్రమాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా జమ చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వంలోనే అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు జగన్తోనే ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, ఎంపిటిసి సభ్యురాలు చందాల పార్వతి, సొసైటీ చైర్మన్ గాజింగం వెంకటరమణ, హితకారిణి రాష్ట్ర డైరెక్టర్ ఉండ్రు సత్యనారయణ, చందాల వెంకటరమణ, బుద్దాల శ్రీను, వనుం చిన వెంకటరమణ, రాయుడు మురళి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

ఫోటో స్టూడియోలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక మఠం సెంటర్ కెనరా బ్యాంకు పక్కన ఒక ఫోటో స్టూడియోలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం రాత్రి అగ్నిప్రమాదం. సంభవించింది. ఈ ప్రమాదంలో ఫోటో డిజిటలైజేషన్‌కు చెందిన అతి విలువైన సామగ్రి కాలి బూడిదయ్యింది. పొగలు, మంటలు బయటకు రావడాన్ని స్థానికులు చూసి పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు. దీంతో పెద్దాపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సామర్లకోట చేరుకున్నారు. విద్యుత్ సరఫరా తొలగించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.

సమాజ సేవే 'కోరమాండల్' లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సమాజ సేవను సామాజిక బాధ్యతగా భావించి పలు సేవా కార్యక్రమాలను తమ కోరమాండల్ ఫెర్టిలైజర్ సంస్థ నిరంతరం కొనసాగిస్తోందని ఆ సంస్థ మహిళా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని తమ సంస్థ యాజమాన్యం అందిస్తోందన్నారు. కంటి చూపు పరిరక్షణ గాను నిరంతరం కంటి వైద్య శిబిరాలను కూడా తమ సంస్థ నిర్వహిస్తోందన్నారు. కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ పేద ప్రజల సంక్షేమానికి అందిస్తున్న సేవలను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శిరీష కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, విజయలక్ష్మి, మోహిని అంజుమ్, రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్, పార్థసారథి పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

జగన్‌ను గద్దె దింపడానికి ప్రజలు సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నిరంకుశ పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక 32 డివిజన్‌లో ఆదివారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ అప్రజాస్వామిక పరిపాలనను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్న జగన్‌ను గద్దె దించే రోజులు దగ్గర పడ్డాయని, సామాన్యుడి జీవనాన్ని జగన్ అతలాకుతలం చేస్తున్నాడన్నారు. నిత్యావసర సరుకులు మొదలు అన్నింటి ధరలూ ఆకాశాన్నంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, రిక్కా లక్ష్మి, మునగాల విజయ్ కుమార్, బాక్సర్, తోట రెడ్డి, కస్తూర్, గొర్రిల గోపు, దారపు బాలారెడ్డి, జిలానీ, సయ్యద్, పొట్నూరి వీరబాబు, పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున వనమాడి వెంకటేశ్వరరావు

ఆధునిక జీవన శైలితో గుండె జబ్బులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా గుండె జబ్బులు వస్తున్నాయని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు జీవితం పరుగులు పెడుతూనే ఉంటుందన్నారు. ఆధునిక జీవన విధానంలో గుండెపై చెడు ప్రభావం పడుతోందన్నారు. అర్ధరాత్రి వరకు జంక్ ఫుడ్, శీతల పానీయాలు అనారోగ్యకరమైన లక్షణమని అన్నారు. రోజూ వ్యాయామం చేయాలన్నారు.

తాళ్లరేవులో దళిత ఐక్యతా ర్యాలీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దళిత ఐక్యత ర్యాలీని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, జిఎంసి బాలయోగి విగ్రహాలకు అసోసియేషన్ గౌరవాధ్యక్షులు దున్నా జనార్ధనరావు, నాయకులు రాయుడు గంగాధర్ పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ నెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని మండలంలో వాడవాడలా నిర్వహించడానికి దళిత గ్రామాలను సిద్ధం చేయడానికి ఈ ర్యాలీ దోహదం చేస్తుందన్నారు. దళితులను ఐక్యంగా చేయడమే అసోసియేషన్ లక్ష్యమన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సీతారామపురం, కోరంగి మీదుగా పలు గ్రామాల్లో సాగింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంటపల్లి చంద్రమౌళి, దున్నా సుబ్రహ్మణ్యం, జక్కల ప్రసాద్ బాబు, కాశి లక్ష్మణస్వామి, గంటా గోపి, ఎలిపే నాగేశ్వరరావు, మాసా శ్రీను, నల్లి శ్రీను, దాసరి వేణుగోపాల్, ఊడా వెంకటరమణ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న దళిత నాయకులు

కార్టూ'నిజం'



ఇలా చేస్తే ప్రజలు మనల్ని చరిత్రలో లేకుండా చేస్తారేమో సార్..!!



ట్రోఫీ అందజేస్తున్న సిఐ దుర్గారావు

క్రికెట్ టోర్నీలో ఎస్‌కెఎస్‌పిటి విజయం

ప్రజాశక్తి-కోటనందూరు

మంత్రి దాడిశెట్టి రాజా పుట్టిన రోజు వేడుకల నేపథ్యంలెట నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో తుని పట్టణానికి చెందిన ఎస్‌కెఎస్‌పిటి జట్టు విజేతగా నిలిచింది. వైసిపి తుని పట్టణ యువజన నాయకులు దాడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. 23 రోజులపాటు సాగిన ఈ క్రికెట్ టోర్నమెంట్లో అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన 24 జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు రెడ్డి, ప్రసాద్ విల్లా తెలిపారు. కెప్టెన్ బోడపాటి శివ దత్తు జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్ విజేతకు రూ.60 వేల నగదు, ట్రోఫీ, షీల్డ్, రన్నరప్ డిఎస్‌ఎఫ్ జట్టుకు రూ.30 వేల నగదు, మెమెంటో, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.20 వేల నగదును తుని పట్టణ సిఐ ఎం.నాగ దుర్గారావు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు బోడపాటి సతీష్, బోడపాటి ప్రవీణ్ చక్రవర్తి, ఎం.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండుగ

జిల్లావ్యాప్తంగా ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే సమాధుల వద్దకు వెళ్లి పితరుల సమాధులను కొవ్వొత్తులతో, పూలతోనూ సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సువర్ణ రాజు మాట్లాడుతూ మానవాళి కోసం ఏసుక్రీస్తు శిలువపై ప్రాణత్యాగం చేసి మూడో రోజున తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగగా క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సలాది సూర్య కిరణ్, అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణంలోని పిఠాపురం రోడ్డులోని క్రైస్తవుల సమాధుల తోట కొవ్వొత్తుల వెలుగులతో వెలిగిపోయింది. బిఎస్ వందనం ఆధ్వర్యంలో క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్ అధ్యక్షతన ఆరాధన నిర్వహించారు. సుబ్బారావు, పి.ఆనంద్ బాబు, బి.కిరణ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటిబాబు, మర్రి శేషారావు, పిట్టా సత్యనారాయణ పాల్గొన్నారు. **పెద్దాపురం** సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో ఎఇఎల్‌సి ప్రెసిడెంట్ డాక్టర్ కె.పెడ్రిక్ పరదేశిబాబు మాట్లాడారు. బి.రాబర్ట్ విజయ్ కుమార్, ఎం.శ్యామ్‌సన్‌ప్రకాష్, బి.జాన్‌కెన్నడీ, ఎం.శ్యామ్‌సన్ డేవిడ్, సుందర కుమారి, వీర కుమార్, నిర్మలాదేవి, సునైనా, విద్యాసాగర్, సురేంద్రబాబు, శేఖర్‌బాబు, వినూత్ కుమారి, సుజాత పాల్గొన్నారు. **రౌతులపూడి** చర్చ్‌లో సామ్యూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **ఏలేశ్వరం** లింగంపర్తి క్రైస్తవ స్మశాన వాటికలో సర్పంచ్ యార్లగడ్డ చంద్రలేఖ రాజా చౌదరి ఆధ్వర్యంలో మత పెద్దలు డేవిడ్ రాజు, వార్డు సభ్యులు వీర్లపాటి సత్యవతి గుండు వీరబాబు విప్పర్తి వెంకన్న పాల్గొన్నారు. **పెదపూడి** బేతేలు చర్చిలో బిషప్ చుక్కా సామ్యూల్‌రాజు, దేవకుమారి క్రీస్తు దైవ సందేశాన్ని వినిపించారు. చుక్కా జాన్ రత్నం, కరకుదురు, పెదపూడి. రామేశ్వరం, జి.మామిడాడ, పెద్దాడ, గండ్రేడు గ్రామాల్లో వేడుకలు జరిగాయి.



సామర్లకోటలో..

మందుబాబులకు అడ్డాగా చెరువుగట్టు


చెరువు గట్టుమీద మద్యం సీసాలు

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం గోపాల్ నగర్‌లో ఉన్న 5 ఎకరాల మంచినీటి చెరువు ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారింది. యానాంలో మద్యం తక్కువ ధరకే లభించడంతో పరిసర ప్రాంతాల నుంచి మద్యం ప్రియులు, మందుబాబులు నిత్యం భారీగా తరలి వచ్చి ఇక్కడ మద్యం సేవిస్తుంటారు. ఈ నేపథ్యంలో జనసంచారం తక్కువగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మందుబాబులు వ్యవహరిస్తున్న తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ చెరువు చుట్టూ ఉదయం సాయంత్రం సమయంలో మహిళలు, వృద్ధులు, యువత నిత్యం వాకింగ్ చేస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో మందుబాబులు రాత్రీ పగలూ తేడా లేకుండా ఇష్టానుసారంగా మద్యం సేవించి అతిగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. చెరువుగట్టు పొడవున కుప్పలు తెప్పలుగా రోడ్లపై బీరు బాటిళ్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. అంతేకాక చాలా కాలంగా మంచి నీటి చెరువు పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. రోజు రోజుకూ ఇక్కడ పరిస్థితి అధ్వానంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు మద్యం సేవించి ఆ బాటిల్స్ పగలగొట్టడం, రోడ్డుపై వదిలివేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోతున్నారు. సుమారు 200 మంది పిడబ్ల్యుడి శాఖకు సంబంధించి ఉద్యోగులు ఉన్నా 55 ఎకరాల చెరువులో మందుబాబులను, అసాంఘిక కార్యకలాపాలను ఆపలేక 'పోతున్నారని' అంటున్నారు. పిడబ్ల్యుడి శాఖకు సంబంధించిన కొంతమంది ఉద్యోగులు సమయపాలన పాటించకుండా, విధులు సక్రమంగా చేయకుండా, తమ సొంత పనులు చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మంచినీటి చెరువుల వద్ద ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మందుబాబుల పని పట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

యానాంలో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణ పరిధిలో ఒక యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. మెట్టకూరు గ్రామ పరిధిలో మదర్ థెరిస్సా కాలనీకి చెందిన బొజ్జ సాయి ప్రవీణ్ (23) తన స్వగృహంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ప్రవీణ్ గాడిమొగలో ఎల్ అండ్ టి కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కాజులూరు

కొత్త మంజేరు గ్రామానికి చెందిన మాసగిరి సూరిబాబు (30) ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రెవెన్యూ సిబ్బంది గొల్లపాలెం పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం..కాజులూరులో కాకా శివకు సంబంధించిన చికెన్ షాపులో మాసగిరి సూరిబాబు రెండేళ్లుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో కోళ్లకు సంబంధించిన బాయిలర్ మిషన్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా మిషన్‌కు విద్యుత్ సరఫరా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సూరిబాబుకు వివాహం అయ్యింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ తులసీరామ్, రెవెన్యూ అధికారి బ్రహ్మాజీ, మహిళా పోలీస్ బామరాజు పరిశీలించారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కేసును ఎస్ఐ తులసీరామ్ దర్యాప్తు చేసినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు.


దగ్ధమైన తాటాకిల్లు

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం దళితవాడలో శనివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన తిరుకోటి లక్ష్మికి చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమై కట్టు బట్టలతో మిగిలారు. ప్రమాద స్థలానికి చేరుకున్న మండపేట అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు, మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియ రాలేదు. ఆస్తి నష్టం రూ.90 వేలు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రమాద సంఘటన స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది, టిడిపి, వైసిపి నాయకులు సందర్శించారు. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, టిడిపి నాయకులు పువ్వల చిట్టిబాబు, కొప్పిశెట్టి వాసు, దొమ్మేటి వీర్రాజు, గొల్లపల్లి శ్రీను, వారా సురేష్, నేతల అన్నవరం, తదితరులు, బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు, బియ్యం, అందజేశారు. వైసిపి నాయకులు కట్టా మురళీకృష్ణ, చింతా పెద్దకాపు, ఎంపిటిసి సభ్యుడు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, విఆర్ఒ ప్రసాద్ తదితరులు, బాధితులను పరామర్శించి బియ్యం, నగదును, అందజేశారు.


కోల సంబరం కళారూప ప్రదర్శన దృశ్యం

ఆకట్టుకున్న కోల సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రాజు చెరువు రామాలయం వీధిలో పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన ప్రముఖ జానపద కళాకారుడు కుంచె అచ్చారావు బృందం ప్రదర్శించిన వెంకన్నబాబు పాట (కోలసంబరం) ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. వెంకన్న బాబు జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలన్నీ కళాకారులు ఆయా పాత్రల వేషధారణలతో, ఆట, పాటలతో ప్రదర్శించడం విశేషం. ప్రాచీన జానపద బాణీలతో ఆలపించిన ఈ కళారూపంలో డప్పు, డోలక్, జముకు వాయిద్య పరికరాలు శబ్ద విన్యాసాల మధ్య ఈ కళా రూపాన్ని కళాకారులందరూ రక్తి కట్టించారు. ఈ కళారూపాన్ని తిలకించిన ప్రేక్షకులు లోవరాజు ఆధ్వర్యంలో కళాకారులను అభినందించారు. ఈ ప్రదర్శనలో బంద నాయకుడు కుంచే అచ్చారావు, రాజు, శ్రీను, ఏసు, దొర బాబు, ఉప్పిడి లోవబాబు, యాసరపు రాజు, గొర్ల ఆంజ నేయులు, కుంచే వీర్రాజు, కుంచే ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.


కొత్తపేటలోని విద్యుత్ సేవా కేంద్రం

నిరుపయోగంగా విద్యుత్ సేవా కేంద్రం

ప్రజాశ-కొత్తపేట

అధికారుల అలసత్వం కారణంగా విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం నిరుపయోగంగా మారింది. సేవా కేంద్రం కొన్ని రోజులుగా తాళం వేసి ఉండడంతో వినియోగదారులు అక్కడికి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. మండల కేంద్రం బస్టాండ్ సెంటర్లో ఉన్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం కొన్ని రోజులుగా తెరవడం లేదు. ఈ సేవా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్ బిల్లులు కట్టించుకునేందుకు, కరెంట్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే తెలిపేందుకు దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని ఏళ్లుగా ఈ కేంద్రం వినియోగదారులకు సేవలు అందించింది. అయితే ఈ కేంద్రాన్ని కొన్ని రోజులుగా తెరవక పోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

500 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గాడిమొగ పంచాయతీ చినవలసలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 500 మందికి వైద్య సేవలందించారు. చిన్నారులకు చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై వైద్యులు ధర్మేంద్ర, ఉజ్వల పరీక్షలు చేశారు. మహిళలు వద్ధులకు జనరల్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు ధర్మేంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ మచ్చ గంగాధర్ రావు, వైద్య సిబ్బంది చందన, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నూకాలమ్మ జాతరకు యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో 45 రోజులపాటు జరిగే నూకాలమ్మ జాతరకు 3వ ఆదివారం అనేక పాంతాల నుండి వేలాదిగా యాత్రికులు తరలి వచ్చారు. ఆలయ పరిసరాలే కాకుండా గ్రామంలోని వీధులన్నీ జనంతో నిండిపోయాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ గవరసాన వీరాస్వామి(బాబ్జి) ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది యాత్రికులు ఇబ్బందులు పడకుండా పలు సేవలు అందించారు. క్యూలైన్లలో యాత్రికులు గంటల తరబడి వేచి ఉండకుండా వేగవంతంగా మొక్కు బడులు చెల్లించుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని గీతా శివ భక్త యువజన సంఘం ఆధ్వర్యంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, సొసైటీ చైర్మన్ పళ్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, గవరసాన రాజశేఖర్ యాత్రికులకు మజ్జిగ, యాత్రికుల పిల్లలకు ఉచితంగా పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బావిశెట్టి గంగరాజు, రొంగల తమ్మారావు, లక్కాకుల కృష్ణ, వేమవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నూకాలమ్మ జాతరలో యాత్రికులు

వేళంగిలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి -కరప

అంబేద్కర్ జయంతి సందర్భంగా రమ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేళంగి గ్రామంలో క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. రమ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత పితాని అన్నవరం ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఈస్టర్ పండుగ కార్యక్రమంలోని పాల్గొన్నారు. వేలంగి గ్రాడ్యుయేట్స్ ప్రతినిధులు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై చలివేంద్రం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరం జాతీయ రహదారి చేరువలో వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ట్రస్ట్ చైర్మన్ మైరాల నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ప్రతినెల తొమ్మిదో తేదీన గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కడలి సత్యనారాయణ, కోశాధికారి అడపా శివప్రసాద్, సారా శ్రీను పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే మహిళాభివృద్ధి

ప్రజాశక్తి-కాజులూరు

రాజకీయ చైతన్యంతోనే మహిళాభివద్ధి సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుతున్న వైసిపి మండల మహిళా కార్యదర్శి, గొల్లపాలెం ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరి దేవిని బోస్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలలో మహిళలకు రాజకీయ చైతన్యం పెరిగిందన్నారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లోను పలు పథకాలలోనూ 50 శాతం మహిళలకు కేటాయించినదన్నారు. ఆయన వెంట పిల్లి సూర్యప్రకాష్, స్థానిక నాయకులు తాడి వాసురెడ్డి పాల్గొన్నారు.

యానాం వార్తలు

సరయుకు గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డ్


ప్రజాశక్తి - యానాం

అమెరికాలో చదువుతున్న యానాం కనకాల పేట గ్రామానికి చెందిన యువతి బత్తిన సరయు లక్ష్మి రాష్ట్రపతి గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం కోన వివిహెచ్.సత్యనారాయణ (కొండబాబు) సత్యమణి ఉమాదేవి మాట్లాడారు. తమ మనవరాలు సరయు లక్ష్మి 15 ఏళ్ల వయసులోనే ఈ గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డు అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు రాత్రనక పగలనక సేవలందించినందుకు గాను ది వైట్ హౌస్ వాషింగ్టన్ తన సేవలను గుర్తించి, అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ సంతకంతో గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డు దక్కించుకుందని తెలిపారు. తను ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో ఉందని అందుచేత మెడిసిన్ విద్యను చదవాలనుకుంటోందని సరయు లక్ష్మి తల్లిదండ్రులు సింధు వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా సరయు లక్ష్మిని పలువురు అభినందించారు.

బిసిలకు అండగా ఉంటా: సత్తిబాబు

ప్రజాశక్తి - యానాం

బిసిలకు అండగా ఉంటానని నూతనంగా ఎన్నికైన బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్యనారాయణ (సత్తిబాబు) అన్నారు. ఈ సందర్భంగా తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాల జాతీయ నాయకుడు ఆర్ కష్ణయ్య, బిసి సేన ఎపి అధ్యక్షుడు సొంటి నాగరాజు ఆధ్వర్యంలో తిరుపతిలో శనివారం జరిగిన సమావేశంలో తనను నియమించడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్లుగా బిసిల కోసం ఎన్నో పోరాటాలు చేశానని, అప్పటినుంచి బిసిలకు అండగా ఉన్నానని తెలిపారు.


ఎంఎల్ఎను సత్కరిస్తున్న మిల్క్ బాయిలర్స్

ఎంఎల్ఎ అశోక్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - యానాం

యానాంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీతాల పెంపునకు కషిచేసిన ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ఆదివారం ఆయా శాఖల ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. గత నెల మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఎ అశోక్ పిడబ్ల్యుడి శాఖలో ఓచర్ పెయిడ్ ఉద్యోగులుగా పని చేస్తున్న సిబ్బందికి రూ.10 వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్స్ ఉద్యోగులకు కూడా రూ.18 వేలు వరకు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచుతున్నట్టు ముఖ్య మంత్రి రంగసామి ప్రకటించారు.

బాప్టిస్ట్ చర్చ్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ ఎల్.ప్రవీణ్ కుమార్ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.రాజారావు, సెక్రటరీ సిహెచ్.జోన్స్ పాల్గొన్నారు.

నేటి నుంచి అడ్డాల చిత్రం షూటింగ్

ప్రజాశక్తి - కడియం

మండలంలోని లంక ప్రాంతాల్లో సోమవారం నుంచి షూటింగ్ సందడి షురూ కానుంది. కొత్త బంగారులోకం ద్వారక క్రియేషన్స్ బ్యానర్‌పై అడ్డాల శ్రీకాంత్ దర్శకత్వంలో సినిమా చిత్రీకరణ ఇప్పటికే ఏజెన్సీ, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. రెండవ షెడ్యూల్ సోమవారం కోనసీమ జిల్లా శేరిలంకలో ప్రారంభం కానుంది. ఈ మేరకు సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్, ఫొటో గ్రాఫర్ చోటా కె.నాయుడు ఆదివారం కడియం నర్సరీలు, రావులపాలెం పరిసర ప్రాంతాల్లో లోకేషన్లను పరిశీలించారు. కొత్త నటీనటులతో నిర్మిస్తున్న ఈ చిత్రంలోని పలు ప్రేమ సన్నివేశాలతో పాటు, పాటల చిత్రీకరణ కడియం నర్సరీల్లో జరుగుతుందని యూనిట్ తెలిపింది. మిర్యాల రవీంద్రరెడ్డి నిర్మాతగా ఉన్న ఈ చిత్రంలో గోదావరి జిల్లాలు, కోనసీమ జిల్లాలోని ప్రకృతి అందాలు, గోదావరి హొయలను చోటా కె.నాయుడు ఫోటోగ్రఫీతో తెరకెక్కిం చనున్నారు. నవరసాలు మేళవింపుతో ఖర్చుకు వెనుకాడకుండా రవీంద్రరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. మొదటి షెడ్యూల్లో 70 శాతం షూటింగ్ పూర్తయ్యిందని, రెండవ షెడ్యూల్ ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని, దీంతో షూటింగ్ పూర్తవుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు.


చిత్రీకరిస్తున్న దర్శకుడు, ఫొటోగ్రాఫర్

పేరూరులో అపూర్వ కలయిక

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ పేరూరు డిఎన్.శెట్టి, డివి.రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-1997 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల అపూర్వ కలయిక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా అప్పటి హెచ్ఎం నూలు అన్నపూర్ణ,సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసుకుని 26 సంవత్సరాలు పూర్తి అయ్యిన సందర్భంగా ఉపాధ్యాయులు అందర్నీ గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అప్పటి విద్యార్థిని విద్యార్థులతో పాటు సహ ఉపాధ్యాయులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం అప్పటి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను, పాఠశాలలో పనిచేసిన సిబ్బందిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రస్తుత హెచ్ఎం మట్టపర్తి పురుషోత్తం రాజు మాట్లాడుతూ ఈ పేరూరు హై స్కూల్ దినదిన అభివద్ధి చెందుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి సిబిఎస్ఇ సిలబస్‌తో 12వ తరగతి వరకు నిర్వహిస్తారన్నారు. అప్పటి విద్యార్థులలో చనిపోయిన 11మంది స్నేహితుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి కొంత ఆర్థిక సాయం అందజేశారు.



మాట్లాడుతున్నఅప్పటిప్రధానోపాధ్యాయురాలు


అన్న ప్రసాదం స్వీకరిస్తున్న యాత్రికులు

దమ్మెన్నులో 1,600 మందికి అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని దమ్మెన్నులో రామాలయం వద్ద ఆదివారం 1,600 మందికి అన్నదానం నిర్వహించామనినిర్వాహకులు తెలిపారు. శ్రీరామనవమి వేడుకలు ముగింపు సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ఈ అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పందుల మృత్యువాతతో స్థానికుల్లో ఆందోళన

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో స్థానిక అయ్యన్న నగర్, వైయస్సార్ నగర్ చుట్టూ ప్రక్కల ప్రాంతాల్లో ఈ మధ్యకాలంలో అధిక సంఖ్యలో పందులు మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పందుల మృతికి అంతు చిక్కని కొత్త వైరస్ కారణమా అని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒకవేళ వైరస్ కారణంగా పందులు చనిపోతే అది మనుషులకు సోకే ప్రమాదం ఉందా అని ఆరా తీస్తున్నారు. మున్సిపాలిటీ వారు పందులను తరలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

పశువుల పాకలకు నిప్పు

ప్రజాశక్తి - గోపాలపురం

గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకలకు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదలో దూడ మృత్యువాత పడగా మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన రాజంపాలెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... సాపిడి కొండ ప్రాంతంలో రాజంపాలెం గ్రామానికి చెందిన చెల్లింకల రామకృష్ణ సుమారు 15 ఏళ్లుగా రెండు పశువుల పాకలను ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే పశువులను కట్టుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా రెండు పాకలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. యజమాని హుటాహుటిన వెళ్లి ఒక పాకలో ఉన్న ఆవుని రక్షించాడు. మూడు గేదెలు మంటల్లో చిక్కుకున్నాయి. తాళ్లు తెంపుకొని తీవ్ర గాయాలతో బయటికి వచ్చినట్లు తెలిపారు. రెండేళ్ల వయస్సు గల దూడ మృత్యువాత పడింది. గాయపడిన వాటిలో రెండు చూడు గేదెలు ఉన్నాయని రైతు తెలిపాడు. ఒక్కొక్కటి రూ.90వేలు విలువ చేస్తాయని తెలిపారు. స్థానికు వెంటనే కొవ్వూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అవి ఘటనా స్థలానికి చేరుకునే సరికే పాకలు పూర్తిగా కాలి దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. రూ.లక్ష విలువైన రెండు పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఒక పాకలో పశువులు, రెండో పాకలో వ్యవసాయ సామగ్రి, 20 బస్తాలు ధాన్యం ఉన్నట్లు తెలిపారు. కాలిపోయి మతి చెందిన దూడ రూ.20 వేలు ఉంటుందని తెలిపాడు. మొత్తం నష్టం విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. గేదెలు చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాయని తెలిపారు. గతంలో ఇదే మాదిరిగా పాకకు నిప్పు పెట్టారని తెలిపాడు. గేదెల కట్టిన స్థలానికి సంబంధించి కొందరితో విభేదాలు ఉన్నట్లు తెలిపాడు. ఫైరింజన్ సకాలంలో రాకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. స్థానికంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.


మంటల్లో దగ్ధమవుతున్న పశువులపాకలు

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి మార్గం గంగాధర్ రావు, జెడ్పిటిసి సభ్యులు గూడపాటి రమాదేవి అన్నారు మండల పరిధిలోని అవిడి గ్రామం లింగాల చెరువు పేట, రజక పేట నందు మండల పరిషత్ రూ.10 లక్షలు నిధుల మంజూరు చేసి డ్రెయిన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, పల్లి దిలీప్, ఎంపిటిసి సభ్యులు నేతల వెంకట, లక్ష్మి,ధూళి సూరి బాబు, సొసైటీ చైర్మన్ నామడి రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సోమవారం కలెక్టరేట్‌లో స్పందన యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటూ డివిజన్, మండల, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా కార్యాలయాల్లోనూ అర్జీలను అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. ఎప్పటిలానే ఆర్‌టిసి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ఉచిత బస్సు సర్వీసు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉంటుందని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.